





# స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం | తెలుగు దినపత్రిక








| వరంగల్ | సంపుటి : 02 | సంచిక : 36 | ఎడిటర్ : డి.శివకృష్ణ | శనివారం | 15-08-2026 | పేజీలు : 04 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|---|
| WARANGAL | VOL : 02 | ISSUE : 36 | EDITOR : D.SHIVAKRISHNA | SATURDAY | 15-08-2026 | PAGES : 04 | PRICE : 2/- |

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts


# రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు




**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**
రాష్ట్రంలో ఇవాళ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంది. అలాగే హైదరాబాద్ మహానగరంలో కాలుష్యాన్ని అరికట్టి 'గ్రీన్ సిటీ'గా మార్చేందుకు కేబినెట్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో ప్రస్తుతం ఉన్న 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా (మిగతా 2లో..)

# స్మార్ట్ రేషన్ కార్డులపై పొలిటికల్ వివాదం

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**
తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అత్యాధునిక 'స్మార్ట్ రేషన్ కార్డుల' పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లా వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లోనూ మంత్రులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ జరగనుంది. ఈ మేరకు పంపిణీ చేయబోతున్న స్మార్ట్ రేషన్ కార్డు మోడల్ ను ప్రభుత్వం విడుదల చేసింది. కార్డుకు ఎడమవైపు సీఎం రేవంత్ రెడ్డి, కుడివైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలను ముద్రించారు. అయితే, పంపిణీ ప్రారంభానికి ముందే ఈ కార్డుల డిజైన్ రాజకీయ దుమారానికి దారితీసింది. కార్డులపై ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో లేకపోవడంపై రాష్ట్ర బీజేపీ నాయకత్వం తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది.

**భగ్గుమన్న బీజేపీ:**
రేషన్ కార్డులపై కేవలం సీఎం, పౌరసరఫరాల శాఖ మంత్రి




ఫోటోలు మాత్రమే ముద్రించి, ప్రధాని మోడీ ఫోటో పెట్టకపోవడం పట్ల తెలంగాణ బీజేపీ నేతలుఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం పంపిణీలో కేంద్రానిదే సింహభాగమని అలాంటప్పుడు ఎవని అయ్య జాగీరు అని రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలు మాత్రమే వేసుకుంటున్నారు? అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఘాటు విమర్శలు చేశారు. ఇక పేదలకు ఉచిత రేషన్ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వమే అందిస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం తమ ప్రచారం కోసం సీఎం, మంత్రి ఫోటోలు వేసుకోవడం హాస్యాస్పదమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. భవిష్యత్ లో ఈ ప్రభుత్వం దిగిపోయాక మళ్లీ కొత్త కార్డులు ఇవ్వాల్సి వస్తుందన్నారు. (మిగతా 2లో..)

# పోలీసులకు సేవా పతకాలు ప్రకటించిన కేంద్రం

## తెలంగాణ, ఏపీకి ఎన్నంటే..?




**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**
దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో అసమాన ప్రతిభ, ధైర్య సాహసాలు ప్రదర్శించిన పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, పౌర రక్షణ విభాగాల సిబ్బందికి కేంద్ర హోంశాఖ సేవా పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా మొత్తం 1,057 మంది అధికారులను ఈ పతకాల కోసం కేంద్ర హోం శాఖ ఎంపిక చేయగా వీరిలో (మిగతా 2లో..)

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## అర్ధరాత్రే ఎందుకు ప్రకటించారు..?

**ఢిల్లీ:**
భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 వసంతాలు. ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలకు స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు. అది బ్రిటీష్ వారి సమయం ప్రకారం అలా ప్రకటించి ఉంటారనుకుంటే పొరపాటే. వందల ఏళ్లపాటు బ్రిటీష్ వారి ఆక్రమణల్లో బానిసలైన భారతీయులకు స్వాతంత్ర్యాన్ని అర్ధరాత్రి ప్రకటించడం వెనుక మన సంప్రదాయం, మన నమ్మకాలే కారణం. దీనివెనుక పెద్ద జ్యోతిష్య వివాదం ఉందన్నది అక్షర సత్యమని చరిత్ర చెబుతోంది. ఆనాడు ఉన్న నక్షత్రాల కలయికను బట్టి ఆగస్టు 15 అంత శుభకరమైన రోజు కాదని సిద్ధాంతులు హెచ్చరించడంతో.. దానిని చక్కదిద్దేందుకే ఎంతో ఆలోచించి అర్ధరాత్రి స్వాతంత్ర్యాన్ని ప్రకటించేలా ప్లాన్ చేశారు. అలా భారతదేశానికి అర్ధరాత్రి స్వాతంత్ర్యం వచ్చింది.

**హఠాత్ ప్రకటనతో అభ్యంతరం..**
నిజానికి బ్రిటీషర్లు 1948 జూన్ నాటికి అధికారాన్ని తిరిగి



బదిలీ చేస్తామన్నారు. కానీ.. 1947 జూన్ 3వ తేదీన భారత్ – పాకిస్థాన్ ల విభజన ప్రణాళికను ప్రకటించారు. ఆ మరునాడే వైస్రాయ్ లార్డ్ మౌంట్ బాటన్ ప్రెస్ మీట్ పెట్టి.. తమ పాతనిర్ణయాన్ని మార్చుకుని 1947 ఆగస్టు 15నే స్వాతంత్ర్యాన్ని ఇస్తున్నట్లు హఠాత్ ప్రకటన చేశారు. ఇందుకు కారణం రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ అదే తేదీన శరణు కోరణం.. 1947 నాటికి అలా శరణు వేడుకుని రెండు సంవత్సరాలు పూర్తికావస్తుండటమే.

(మిగతా 2లో..)

# దేశంలోనే తెలంగాణ సైబర్ పోలీస్ బెస్ట్: డీజీపీ సీవీ ఆనంద్



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**
సైబర్ నేరాలపై తెలంగాణ పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలపై డీజీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ సైబర్ పోలీస్ బెస్ట్ అని కొనియాడారు. 'సురక్షా కా తిరంగా' ప్రచారంలో భాగంగా తెలంగాణ సైబర్‌క్రైమ్ బ్యూరో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేక సైబర్ (మిగతా 2లో..)

# ఏడాది ముందే విద్యార్థుల ఖాతాల్లోకి నగదు

## ఫీజు రీయింబర్స్ మెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**
రాష్ట్రంలోని పేద విద్యార్థుల చదువుకు ఫీజుల భారం అడ్డుకాకూడదనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అడ్వాన్స్ గా విద్యార్థుల ఖాతాలో ఫీజు రీయింబర్స్ మెంట్ డబ్బులు జమ చేయబోతున్నామని చెప్పారు. ఈ ఏడాదికి సంబంధించిన ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఇప్పటికే రూ.250 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమచేశామని భవిష్యత్‌లో కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నెలలోపు ఫీజు రీయింబర్స్ మెంట్ డబ్బులు విద్యార్థుల ఖాతాలో జమ చేస్తామన్నారు. శుక్రవారం ట్యాంక్ బండ్ ఎవీణూ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించిన సీఎం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. పారదర్శకంగా ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం అమలు చేయాలని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఫీజు కట్టలేదని సర్టిఫికెట్ ఇవ్వమని కాలేజీ యాజమాన్యాలు చెప్పే పరిస్థితి ఇకపై రాబోదన్నారు.

**సామాజిక న్యాయానికి అనేక కుట్రలు:**
ఈ దేశంలో పశువులకు లెక్క ఉంది కానీ బీసీల లెక్కలు లేవని అందుకే ఎన్ని అడ్డంకులు వచ్చినా బీసీ జనగణన చేపట్టామని ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ కులగణన చేపట్టామని సీఎం చెప్పారు. కుటుంబ సమగ్ర సర్వేలో పాల్గొనని వారు బీసీ లెక్కలను అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశారని విమర్శించారు. గత ప్రభుత్వంలో గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని చెబితే మేము డాక్టర్లు, లాయర్లు ఐఏఎస్, ఐపీఎస్ లు, ప్రజాప్రతినిధులు కావాలని అంటున్నామన్నారు. నాకు వయసు ఓపికతో పాటు మంచి సలహాదారులు, సహచరులు ఉన్నారని ఇంత మంచి అవకాశం, మీరు కోరుకుంటున్న ఇలాంటి ప్రభుత్వం మళ్లీ రాదన్నారు. ఈ ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

**కుల నిర్మూలకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్స్:**
ట్యాంక్ బండ్ కు వస్తే గొప్ప వ్యక్తుల విగ్రహాలు కనిపిస్తాయని ఇవి కేవలం విగ్రహాలే కాదని వారు చేసిన త్యాగాలు. వాళ్ల గొప్పతనాలు భావితరాలకు (మిగతా 2లో..)

# పార్టీ గీత దాటితే చర్యలు తప్పవు..

## రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ గరం



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**
కాంగ్రెస్ పార్టీతో ఏమాత్రం సంబంధం లేని వారు, ఆంధ్ర నాయకుల మోచేతి నీళ్లు తాగే వారు ఇవాళ ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం సహించరాని విషయం అంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అధికార పార్టీలో నిప్పు రాజేశాయి. ఈ నేపథ్యంలోనే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తాజాగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం, పార్టీ అధిష్టానంపై ఆయన పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. విషయాన్ని ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టి తీసుకెళ్తామని అన్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి నేతనైనా సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు. పార్టీ గీత దాటితే ముఖ్యమంత్రితో సహా ఎవరైనా సరే అందరూ ఒకటేనని అన్నారు. క్రమ శిక్షణారాహిత్యానికి పాల్పడితే ఖచ్చితంగా చర్యలుంటాయని పేర్కొన్నారు. రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, తీసుకోవాల్సిన చర్యలపై కాంగ్రెస్ హైకమాండ్‌తో చర్చిస్తామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

**అందరి కోరికలు తీర్చడం సాధ్యం కాదు..**
ఎన్నికల సమయంలో మునుగోడులో ప్రచారం సందర్భంగా రాజగోపాల్ రెడ్డికి పార్టీ అధిష్టానం కొన్ని హామీలు ఇచ్చి ఉండవచ్చని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అయినప్పటికీ, పార్టీకి వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడటానికి ఎవరికీ హక్కు లేదని అన్నారు. పదవులు, మంత్రివర్గ విస్తరణపై పార్టీ హైకమాండ్‌దే తుది నిర్ణయమని.. ఒకేరోజు అందరి కోరికలు తీర్చడం ఎంతటి వారికైనా సాధ్యం కాదిని కుండబద్దలు కొట్టారు. అయితే, మంత్రివర్గంలో స్థానం లభించలేదన్న అసంతృప్తితో పాటు నియోజకవర్గానికి నిధుల కేటాయింపుపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని పార్టీ క్రమశిక్షణా కమిటీకి పంపే యోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది.

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏమన్నారంటే..!**
కాగా, హైదరాబాద్ రవీంద్ర భారతిలో కళాకారుడు ఏపూరి సోమన్న 25 ఏళ్ల పాటల ప్రస్తానంపై రూపొందించిన పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత ప్రభుత్వానికి (మిగతా 2లో..)

# దేశంలోనే తెలంగాణ సైబర్ పోలీస్ బెస్ట్: డీజీపీ సీవీ ఆనంద్

(మొదటి పేజీ తరువాయి)

అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి కార్యాలయం పర్యవేక్షించిన జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో తెలంగాణ సైబర్‌క్రైమ్ విభాగం, జిల్లా యూనిట్లు అత్యుత్తమ పనితీరు కనబరిచి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచాయని వెల్లడించారు. సమాజంలో మాదకద్రవ్యాలు, కల్తీ ఆహారం, వ్యవస్థీకృత నేరాలతో పాటు సైబర్ నేరాలు కూడా పెను ముప్పుగా పరిణమిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, వివిధ రంగాల నిపుణులను లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. మొత్తం సైబర్ నేరాల్లో దాదాపు 60 శాతం పెట్టుబడి మోసాలే ఉంటున్నాయని, విస్తృత ప్రచారం చేస్తున్నప్పటికీ ఫేక్ వెబ్‌సైట్లు, వాట్సాప్ గ్రూపులు, నకిలీ ఫోన్ కాల్స్ నమ్మి ప్రజలు మోసపోతూనే ఉన్నారని డీజీపీ పేర్కొన్నారు. అయితే గత ఆరు నెలల నుంచి ఏడాది కాలంలో తీసుకున్న పటిష్ఠ చర్యల వల్ల 'డిజిటల్ అరెస్ట్' మోసాలను 70 శాతానికి పైగా విజయవంతంగా తగ్గించగలిగామని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పెట్టుబడి మోసాలు, సెక్స్‌టార్షన్, ఓటీపీ, కేవైసీ ఫ్రాడ్స్ వంటి వాటిపై ప్రజల్లో మరింత అవగాహన పెంచడం పైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నామని డీజీపీ వెల్లడించారు.

# పార్టీ గీత దాటితే చర్యలు తప్పవు..

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోపిడీకి పాల్పడుతున్న వారికి వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం కావాలని, అందుకే ఏపూరి లాంటి కళాకారులు గజ్జ కట్టాలని అన్నారు. ఏపూరి సోమన్న పాడిన.. ఎవరి పాలైందిరో తెలంగాణ పాటలోని పరిస్థితులే నేడు రాష్ట్రంలో కొనసాగడం బాధకరమని రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని అభివృద్ధి పేరుతో లక్షల కోట్లు దోచుకుంటున్నారని.. అలాంటి దోపిడీదారుల వెంట పడతామని, వారి దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. మా సహనాన్ని, ఓపికను చేతకాని తనంగా భావించవద్దని, ఇన్నాళ్లు సహనంగా ఉన్నామని, ఇక పోరాటానికి సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. స్వరాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారులకు, పేదలకు న్యాయం దక్కడం లేదని, అభివృద్ధి పేరిట తెచ్చిన రూ.లక్షల కోట్ల అప్పులు చేసిన నిధులు ఆంధ్ర కాంట్రాక్టర్లకే దక్కుతున్నాయని విమర్శించారు. అధికారంలో ఉన్న వారు రూ.లక్షల కోట్లు దోచుకుంటుంటే పేదోడికి రూ.5 లక్షల ఇందిరమ్మ ఇంటి బిల్లుకు 500 కొర్రీలు పెడుతున్నారని తప్పుబట్టారు.

# స్మార్ట్ రేషన్ కార్డులపై పొలిటికల్ వివాదం

## సీఎం సభలో గొడవైతే మాకు సంబంధం లేదు:

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోడీ ఫోటో లేకుండా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఒక్కో లబ్ధిదారుడికి ఇచ్చే 6 కిలోల బియ్యంలో 5 కిలోలు కేంద్ర ప్రభుత్వమే ఇస్తోంది. అలాంటప్పుడు మోడీ ఫోటో పెట్టకపోవడం కేంద్రాన్ని అవమానించడమే అని మండిపడ్డారు. నిరసనల నడుమ సంగారెడ్డి పంపిణీ సభలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే దానికి బీజేపీని బాధ్యులను చేయవద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పని తక్కువ.. ప్రచారం ఎక్కువ సెటైర్ వేశారు. కాగా, ఇవాళ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఉండగా మోడీ ఫోటో పై చెలరేగిన పొలిటికల్ వివాదం ఎలాంటి ఉద్రిక్తతలకు దారితీస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# పోలీసులకు సేవా పతకాలు ప్రకటించిన కేంద్రం..

(మొదటి పేజీ తరువాయి)

92 మంది రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు, 301 మందికి పోలీసు మెడల్ ఫర్ గ్యాలంట్రీ, 664 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలకు ఎంపిక అయ్యారు. గ్యాలంట్రీ పతకాలు సాధించిన 301 మందిలో అత్యధికంగా 197 మంది తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో సాహసోపేత సేవలు అందించిన వారు ఉన్నారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన 51 మందికి, ఈశాన్య రాష్ట్రాలలోని 12 మంది పోలీసులకు ఈ పతకాలు దక్కాయి.

## తెలంగాణకు 15, ఏపీకి 21:

కాగా, ఈ ప్రతిష్ఠాత్మక పతకాలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 21, తెలంగాణ నుంచి 15 మంది ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ఎంపికైన 15 మందిలో ముగ్గురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 10 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు ప్రకటించారు. రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలను అదనపు డిప్యూటీ కమిషనర్ జోగుల నర్సయ్య, ఎస్పీ ఆర్.జగదీశ్వర్ రెడ్డి అందుకోనుండగా గ్యాలంట్రీ మెడల్స్‌ను జూనియర్ కమాండోలు బి.సత్యరావు, కె.సందీప్ కుమార్, జె.వంశీకృష్ణ అందుకోబోతున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ పోలీసులలో ఏడుగురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 11 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఏపీకి చెందిన ఐజీ గుడి విజయ్ కుమార్, ఐజీ బలంకారి వెంకట రామిరెడ్డి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు ఎంపిక కాగా.. గ్యాలంట్రీ మెడల్స్ కు హెడ్ కానిస్టేబుళ్లు కొర్లాన మహేశ్, పైడి శ్రీరామమూర్తి, అడారి హేమసుందర రావు, చింతపల్లి సత్యనారాయణ, రౌతు మహేశ్, ఆబోతుల అప్పలనాయుడు, రుతాల కన్నబాబు ఎంపికయ్యారు.

## సీబీఐ అధికారులకు 21 పతకాలు:

కేంద్ర దర్యాప్తు సంస్థలో పనిచేస్తున్న 21 మంది అధికారులకు పతకాలు దక్కాయి. ఇందులో ఆరుగురికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 15 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. విశాఖపట్నం డీఎస్పీ (సీబీఐ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సంజయ్ కుమార్ సమాల్?కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం వరించింది.

# 'ముడా' తరహాలోనే టెస్సెరాక్ట్ భూ కుంభకోణం

## సీఎం రేవంత్ రెడ్డి ఫ్యామిలీపై లోకాయుక్తాలో బీఆర్ఎస్ ఫిర్యాదు





స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబంపై బీఆర్ఎస్ లోకాయుక్తలో ఫిర్యాదు చేసింది. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన 'టెస్సెరాక్ట్' కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కేటాయించారంటూ బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డిలతో కూడిన బృందం శుక్రవారం లోకాయుక్తను ఆశ్రయించి ఫిర్యాదు అందజేశారు. సీఎం సోదరుడు కొండల్ రెడ్డి 'టెస్సెరాక్ట్' కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా విలువైన భూముల కేటాయింపు చేశారని రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకు ధారాదత్తం చేశారని అందువల్ల టెస్సెరాక్ట్ భూ కేటాయింపులను వెంటనే రద్దు చేసి, ఇందులో సీఎం రేవంత్ రెడ్డి పాత్రపై విచారణ కోసం నివేదికను గవర్నర్‌కు పంపాలని డిమాండ్ చేశారు.

## ముడా తరహాలో టెస్సెరాక్ట్ కుంభకోణం:

లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ కర్ణాటక 'ముడా' తరహాలోనే తెలంగాణలో టెస్సెరాక్ట్ భూ కుంభకోణం సాగిందని ఆరోపించారు. ఏరోస్పేస్ కంపెనీ అని చెప్పుకుంటున్న టెస్సెరాక్ట్ చెల్లించిన మూలధనం కేవలం రూ.1 లక్ష మాత్రమేనని ఈ కంపెనీ అధికారిక బోర్డు నివేదిక ప్రకారం కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 'సున్నా' అని ఆరోపించారు. నివాస ఫ్లాట్ అడ్రస్‌తో నడుస్తున్న కంపెనీకి రూ.200 కోట్ల విలువైన డిఫెన్స్ భూములు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. యూరోపియన్ యూనియన్ ఆడిట్ సైట్ నుంచి ఫోటోలు దొంగిలించి ప్రదర్శించారని ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తమ ఫిర్యాదులో ప్రతివాదులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏ1 గా, ఏ2 గా మంత్రి శ్రీధర్ బాబు, టీజీఐఐసీ అధికారులుగా పేర్కొంటూ ఫిర్యాదు చేశామన్నారు. వీరిపై అవినీతి నిరోధక చట్టం, దీచీూ సెక్షన్ల కింద విచారణకు బీఆర్ఎస్ డిమాండ్ చేసింది.

# హయత్ నగర్‌లో ఘనంగా 'ఏఎన్ మొబైల్స్' షాప్ ప్రారంభం

**ముఖ్య అతిథులుగా హాజరైన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, సీఐ అంజపల్లి నాగమల్లు**

స్టార్ త్రినేత్రం, హయత్ నగర్:




హయత్ నగర్ బొమ్మల గుడి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఏఎన్ మొబైల్స్' షాప్ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. నిర్వాహకులు పాలడుగు ఉపేందర్, రమ దంపతులు ఏర్పాటు చేసిన ఈ షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, సీఐ అంజపల్లి నాగమల్లు హాజరై షాపును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ.. హయత్ నగర్ బొమ్మల గుడి సమీపంలో పాలడుగు ఉపేందర్, రమ ఏఎన్ మొబైల్స్ ప్రారంభించడం చాలా సంతోషకరమన్నారు. నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో ఒక నిత్యావసరంగా మారిపోయిందని, వినియోగదారులకు నాణ్యమైన బ్రాండెడ్ మొబైల్స్, యాక్సెసరీస్, సర్వీసింగ్ సేవలను ఒకే చోట అందించేలా ఈ షాపును ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. యువత ఇలా సొంతంగా వ్యాపారాలు స్థాపిస్తూ ఆర్థికంగా ఎదగడమే కాకుండా పది మందికి ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. కస్టమర్లకు మర్యాదపూర్వకమైన, నమ్మకమైన సేవలు అందిస్తూ దంపతుల ఈ వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు పాలడుగు ఉపేందర్, రమ మాట్లాడుతూ.. తమ ఏఎన్ మొబైల్స్ షాప్ ప్రారంభోత్సవానికి అమూల్యమైన సమయాన్ని వెచ్చించి విచ్చేసిన ఎమ్మెల్యే మందుల సామెల్, సీఐ అంజపల్లి నాగమల్లు, తదితర నాయకులు, బంధుమిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమ షాపులో అన్ని రకాల ప్రముఖ బ్రాండెడ్ మొబైల్స్, వాటికి సంబంధించిన నాణ్యమైన యాక్సెసరీస్ సరసమైన ధరలకే లభిస్తాయని వెల్లడించారు. అమ్మకాలతో పాటుగా, కస్టమర్ల ఫోన్లకు సంబంధించి ఎలాంటి సమస్యలైనా అత్యుత్తమంగా సర్వీసింగ్ చేస్తామని, కస్టమర్ల సంతృప్తే తమ ప్రథమ లక్ష్యంగా ఈ ప్రాంత ప్రజలకు నమ్మకమైన సేవలు అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనం మీడియా ఫౌండర్ పాలడుగు ప్రవీణ్ కుమార్, మద్దిరాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పచ్చిపాల వెంకన్న యాదవ్, తుంగతుర్తి బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పచ్చిపాల సుమతి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు స్థానిక నాయకులు విశేషంగా పాల్గొన్నారు.

# రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం

(మొదటి పేజీ తరువాయి)

మార్చేందుకు రూ.200 కోట్లతో "తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్" అమలుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1,50,000 సబ్సిడీ అందిచనున్నారు. ఆటో డ్రైవర్లు తమ పాత ఆటోకు ఈవి కిట్ అమర్చుకోవడానికి లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త ఈ-ఆటో కొనుగోలు చేయడానికి ఈ సబ్సిడీ వర్తింపచేయనున్నారు.

## డిసెంబర్ లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0':

గత ఏడాది తరహాలోనే ఈ ఏడాది కూడా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ సదస్సును నిర్వహించేందుకు ప్రాథమికంగా నిర్ణయించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామిల ఆధ్వర్యంలో సబ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో జరిగే ఈ సదస్సులో 'ఫ్యూచర్ సిటీ ప్లాన్' ను ప్రభుత్వం ఆవిష్కరించనుంది. డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా స్టార్టప్స్, కొత్త ఆవిష్కరణలతో భారీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు.

## 7 రకాల సన్నాలకు రూ.500 బోనస్!

వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రైతు వేదికలు, గ్రామ పంచాయతీల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ ఏడాది నుంచి ఈ 7 రకాల సన్నాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించనున్నారు. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. రికార్డు స్థాయిలో 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, కేంద్రం కేవలం 63.62 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే తీసుకుంటుంది. మిగిలిన 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి.. ఈ వేలం ద్వారా ధాన్యం అమ్మాలని కేబినెట్ నిర్ణయించింది.

## విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు:

రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు క్యాబినెట్ తీర్మానించింది. మరో 7 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు: ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో కొత్తగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. దీంతో ఇప్పటివరకు మంజూరైన స్కూళ్ల సంఖ్య 86కి చేరింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు.

## కొడంగల్ ఎత్తిపోతలకు రూ.2,100 కోట్లు:

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు ఫేజ్-2 పనుల కోసం రూ.2,100 కోట్ల అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందుతుంది. అలాగే గూడెం దొడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచడంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనానికి కన్సల్టెంట్‌ను నియమించనున్నారు.

## ఎ×ూ పాలసీ గడువు పెంపు:

హైదరాబాద్ నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను శివార్లకు తరలించే HILTపాలసీ దరఖాస్తుల గడువును దరఖాస్తుదారుల విజ్ఞప్తి మేరకు అక్టోబర్ 31 వరకు (మరో 3 నెలలు) పొడిగిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

అప్పట్లో ఇంత ఫాస్ట్ నెట్వర్క్ లేదు. ఈ వార్త రేడియోలా రావడం ఆలస్యం.. కలకత్తా, వారణాసి, దక్షిణాది ప్రాంతాలకు చెందిన జ్యోతిష్కులు షాకయ్యారు. 1947 ఆగస్టు 15 శుక్రవారం కావడం, ఆ సమయంలో మకరం, శని, రావు ప్రభావాలు సరిగ్గా లేకపోవడంతో నవభారతం ఆవిర్భావానికి శుభశూచకం కాదని పేర్కొన్నట్లుగా ఫ్రీడమ్ ఎట్ మిడ్ నైట్ బుక్ రైటర్లైన డొమినిక్ లాపియర్, లారీ కొలిన్స్ రాశారు.

## ససేమిరా కుదరదన్న మౌంట్ బాటన్

దీంతో సిద్ధాంతులు మౌంట్ బాటన్ కు.. స్వాతంత్ర్య దినోత్సవ తేదీని మార్చాలని కోరుతూ లేఖ రాశారు. వరదలు, కరవు, హింస వంటి విపత్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అయినా సరే తేదీని మార్చడం కుదరదని కరాకండిగా చెప్పడంతో.. ఏం చేయాలా అని జ్యోతిష్యులంతా ఆలోచనలో పడ్డారు. అప్పటికే స్వాతంత్ర్య సంబరాలకు ఏర్పాటు జరుగుతుండటంతో.. తేదీని మార్చడం అంత సులభం కాదనుకున్నారు. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం ఆగస్టు 15న ఏ సమయం మంచిదో లెక్కించడం మొదలుపెట్టారు. అభిజిత్ ముహూర్తం, పుష్య నక్షత్రం వంటి అంశాలపై చర్చించి.. సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలకు సమయం బాగున్నట్లు తేల్చారని పుస్తకంలో రాశారు. పాశ్చాత్య సంస్కృతి ప్రకారం అర్ధరాత్రి 12 గంటలైతే తేదీ కూడా మారుతుంది.

## జవహర్ లాల్ నెహ్రూ ప్రణాళికతోనే..

ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న జవహర్ లాల్ నెహ్రూ.. అర్ధరాత్రివరకూ రాజ్యాంగ సభ కొనసాగేలా ప్రణాళిక వేశారు. సరిగ్గా 12 గంటలు కాగానే.. భారత్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవిస్తూ.. సరికొత్త అధ్యాయంలోకి అడుగుపెట్టింది. అలా ప్రపంచమంతా నిద్రిస్తున్న వేళ భారత్ స్వేచ్ఛలోకి మేల్కొంటుంది అని నెహ్రూ దేశానికి కొత్తదిశను చూపించారు. అర్ధరాత్రి స్వేచ్ఛా భారతం వికసించింది.

నోట్: సోషల్ మీడియాలో దొరికిన సమాచారం ఆధారంగా ఈ వార్తను ప్రచురించడం జరిగింది. దీనిని స్టార్ త్రినేత్రం అధికారికంగా ధృవీకరించట్లేదు. పాఠకులు గమనించగలరు.

# ఏడాది ముందే విద్యార్థుల ఖాతాల్లోకి నగదు

(మొదటి పేజీ తరువాయి)


తెలియాలనే విగ్రహాల ఏర్పాటు అన్నారు. 150 ఏండ్ల క్రితం చదువుకు ఉన్న ప్రాధాన్యతను పూలే దంపతులు చాటి చెప్పారని అన్నారు. సమాజంలో కుల నిర్మూలన తీసుకువచ్చేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు శ్రీకారం చుట్టామన్నారు. నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలో అందించే ప్రయత్నం చేస్తున్నాంమన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న వారికే ప్రపంచం రెడ్ కార్పెట్ తో స్వాగతిస్తోందని. భాషా నైపుణ్యం ఉన్న నర్సులకు జర్మనీ, జపాన్, దక్షిణ కోరియాలో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఐటీ నిపుణులు కూడా ఉద్యోగాలు పోయి వెనక్కి వచ్చే పరిస్థితి ఏర్పడిందని, ఏఐ వల్ల ఐటీ నిపుణుల ఉద్యోగాలు పోయే పరిస్థితి సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో అందరూ ఆలోచించాలన్నారు. అదువల్ల చదువుల్లో నాణ్యత ఉండాలని.. స్కిల్స్ పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఐటీఐలను ఏటీసీలుగా అభివృద్ధి చేశామన్నారు. ఒలింపిక్స్ లో మెడల్స్ సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగం, నజరానాలు ఇస్తామన్నారు.

## హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల ఇంఛార్జ్‌గా బకున రమేష్ నియామకం



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**
'స్టార్ త్రినేత్రం' తెలుగు దినపత్రికకు హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల ఇంఛార్జ్‌గా బకున రమేష్ శుక్రవారం నియమితులయ్యారు. ఆయనను ఆయా జిల్లాలకు బ్యూరో చీఫ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ 'స్టార్ త్రినేత్రం' యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. జర్నలిజం రంగంలో తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, సమాజంలో చోటుచేసుకునే అవినీతి, అక్రమాలను నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా బకున రమేష్ తెలిపారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ వాస్తవాలను ఆధారంగా చేసుకుని వార్తలను అందించడమే తన ప్రధాన లక్ష్యమని బకున రమేష్ పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలో ప్రజలకు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వారి సమస్యలకు సంబంధించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే విధంగా తన బాధ్యతలను నిర్వర్తిస్తానని తెలిపారు. ముఖ్యంగా అవినీతికి వ్యతిరేకంగా నిష్పక్షపాతంగా పనిచేస్తూ ప్రజల పక్షాన నిలబడేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ 'స్టార్ త్రినేత్రం'కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ యాజమాన్య ప్రతినిధులు బకున రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అష్టలక్ష్మి సహిత లలిత పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



**స్టార్ త్రినేత్రం, సిద్దిపేట:**
శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మొదటి శుక్రవారం సందర్భంగా సిద్దిపేటలోని శ్రీ శ్రీ శ్రీ అష్టలక్ష్మి సహిత లలితా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి విశేష అభిషేకం, ప్రత్యేక అలంకరణ, శ్రీచక్ర కుంకుమార్చనతో పాటు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి, విశేష అభిషేకం, పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. శ్రావణ మాసంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం ద్వారా భక్తులకు శుభం, సుఖసంతోషాలు కలుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు కృపాకరాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆలయ నిర్వాహకులు జి. కిరణ్ కుమార్ వెల్లడించారు.



## బిజెపి ఆధ్వర్యంలో తిరంగ కార్యక్రమం



**స్టార్ త్రినేత్రం, వేములవాడ :**
బిజెపి ఆధ్వర్యంలో తిరంగ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వేములవాడ గౌతమ్ మోడల్ స్కూల్లో విద్యార్థులకు ప్రతి ఒక్కరికి జెండాలు అందజేసి జాతీయ జెండా గౌరవాన్ని తెలియజేసిన ప్రతాపరామకృష్ణ వారు మాట్లాడుతూ దేశం భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని అన్నారు ఏలాంటి కుల మత జాతి భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఎత్తాల్సిన ది మన భారత దేశ జాతీయ జెండా అన్నారు దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత సంవత్సరం వరకు తెలంగాణకు విమోచనం రాకపోవడం బాధాకరమని గుర్తు చేశారు ప్రతి ఒక్కరు కూడా ఇంటిపై జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారుఈకార్యక్రమానికి ముందు జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తిరంగా ర్యాలీలో వేములవాడకు నుండి పెద్ద ఎత్తున బిజెపి నాయకులు తరలి వెళ్లడంజరిగింది. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్,రాష్ట్ర నాయకులు కౌన్సిలర్ కుమ్మరి శంకర్, కొండ్లెపు ముత్యం, వంగల శీను, మైలారం శ్రీను, నాయకులు సిరికొండ శ్రీనివాస్, రేగుల సంతోష్ బాబు, రేగుల శ్రీకాంత్, మామిళ్ళ లక్ష్మీరాజ్యం, పిన్నింటి హనుమన్లు, బిల్ల కృష్ణా, గుడిసె మనోజ్, కటకం శ్రీనివాస్, వివేక్ రెడ్డి, డాక్టర్ వెంకన్న, నామాల శేఖర్,పల్లెపు లక్ష్మణ్,జగన్నాథం, శీను, సాయికృష్ణ, హరీష్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## కర్మన్ ఘాట్ స్లేట్ ది స్కూల్ విద్యార్థుల హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**స్టార్ త్రినేత్రం, కర్మన్‌ఘాట్:**
80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కర్మన్‌ఘాట్‌లోని స్లేట్ ది స్కూల్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్లు శుక్రవారం దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీలో ఎన్‌సీసీ క్యాడెట్లు క్రమశిక్షణతో పాల్గొని జాతీయ జెండా ప్రాధాన్యతను, దేశభక్తి భావనను ప్రజల్లో చాటిచెప్పారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశ ఐక్యత, సమగ్రత, దేశభక్తి భావాలను మరింత బలోపేతం చేయాలనే సందేశాన్ని విద్యార్థులు అందించారు. చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకుని, దేశభక్తి నినాదాలు చేస్తూ క్యాడెట్లు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ మార్గంలో ప్రజలు, స్థానికులు విద్యార్థుల దేశభక్తి కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం, దేశభక్తి వంటి విలువలు పెంపొందుతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు నిర్వహించిన ఈ ర్యాలీ విద్యార్థుల్లో జాతీయ స్ఫూర్తిని మరింత పెంచింది. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడంతో పాటు, దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని విద్యార్థులు సందేశమిచ్చారు.

**ప్రిన్సిపాల్ సింపుల్ దయామా వ్యాఖ్యలు**

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సింపుల్ దయామా మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం అనేది ఎంతోమంది మహనీయుల త్యాగాల ఫలితమని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ ఐక్యత, బాధ్యతాయుత పౌరసత్వం వంటి విలువలను పెంపొందించాలనే ఉద్దేశంతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. జాతీయ జెండా ప్రతి భారతీయుడి గర్వానికి ప్రతీక అని, త్రివర్ణ పతాకాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా దేశం, సమాజం పట్ల తమ బాధ్యతలను తెలుసుకోవాలని సూచించారు. ఎన్‌సీసీ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సేవాభావం పెరుగుతాయని తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో జాతీయ జెండా రెపరెపలాడాలని, ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావన మరింత బలపడాలని ఆకాంక్షించారు. ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లను, వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. రానున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి, జాతీయ ఐక్యత స్ఫూర్తితో ఘనంగా నిర్వహించేందుకు పాఠశాల సిద్ధంగా ఉందని ప్రిన్సిపాల్ సింపుల్ దయామా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్లు, విద్యార్థులు, సిబ్బంది, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






## మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే

**స్టార్ త్రినేత్రం, సిద్దిపేట:**
మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 40 మందికి సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు జరిమానాలతో పాటు జైలు శిక్షలు విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా సిద్దిపేట ట్రాఫిక్ సీఐ చెట్టుక్రింది ముత్యం రాజు ఆధ్వర్యంలో పోలీసులు గత నాలుగు రోజులుగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మొత్తం 73 కేసులు నమోదు కాగా, రూ. 5,49,500 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 40 మందికి కలిపి రూ. 3,84,500 జరిమానా విధించడంతో పాటు నలుగురికి జైలు శిక్ష విధించారు. మరోవైపు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 33 మందికి రూ. 1,65,000 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో కడమంచి శ్రీనివాస్‌కు రూ. 10 వేల జరిమానాతో పాటు ఐదు రోజుల జైలు శిక్ష, కేమ్మసారం పర్శరాములుకు ఐదు రోజుల జైలు శిక్ష, కల్లెపు సుధాకర్‌కు 10 రోజుల జైలు శిక్ష, దొమ్మాట నర్సింహులుకు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ముత్యం రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల వాహనదారుల ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని కోరారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే రూ. 10 వేల జరిమానాతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ. 5 వేల జరిమానాతో పాటు జైలు శిక్ష వంటి కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఐ హెచ్చరించారు.

## ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి ఆధ్వర్యంలో ఘనంగా ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**
సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి జాతీయ చైర్మన్ డా. కొప్పుల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ ముందస్తు వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ?ఈ కార్యక్రమానికి జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు కే. రాములు, నార్కోటిక్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఉమెన్ సేఫ్టీ తెలంగాణ ఇన్చార్జి పి. సురేఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్ హైదరాబాద్ ఇన్స్పెక్టర్ టి. శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ?ఈ సందర్భంగా నార్కోటిక్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, సమాజాన్ని పట్టి పీడిస్తున్న మత్తు పదార్థాల డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించారు. ఉమెన్ సేఫ్టీ తెలంగాణ ఇన్చార్జి పి. సురేఖ మాట్లాడుతూ, సమాజంలో మహిళల భద్రత, రక్షణ మరియు వారి ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ అందిస్తున్న సేవల గురించి ఈ సందర్భంగా చర్చించారు. సంస్థ



జాతీయ చైర్మన్ డా. కొప్పుల విజయ్ కుమార్ ప్రసంగిస్తూ. ప్రతి ఒక్కరూ మానవ హక్కులతో పాటు తమ బాధ్యతలు, విధులను విస్మరించకూడదని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల పట్ల పౌరులు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పలువురు ప్రతినిధులు, సభ్యులు మరియు పురప్రముఖులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ వైస్ చైర్మన్ రాజు, చీఫ్ అడ్వైసర్స్ డా. మార్గం విజయ్ పటేల్, షేక్. అమీర్ హుస్సేన్, బోర్డు డైరెక్టర్ కె. రవి బాబు, నేషనల్ జనరల్ సెక్రటరీ హన్మ గౌడ్, సౌత్ ఇండియా చైర్మన్ డా. జూపల్లి తిరుమల రావు, వర్కింగ్ కమిటీ చైర్మన్ డా. సంపత్ గౌడ్, తెలంగాణా రాష్ట్ర సెక్రటరీ బి. దత్తాద్రి గౌడ్, వైస్ చైర్మన్ ముంజ రమేష్ గౌడ్, డైరెక్టర్ మాలేపు నారాయణ, మహిళా విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ వసుంధర చక్రవర్తి, సెక్రటరీ ఎస్. దివ్య జ్యోతి, ఆర్ టి ఐ చైర్మన్ సాప పండరి, కె. మధుకర్, కర్నూల్ జిల్లా చైర్మన్ అంబడీపూడి మారుతి, బోయిని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి తొలిప్రాధాన్యం...


**పారిశుద్ధ్యం నుంచి రోడ్ల వరకు**
**అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి...**
**పట్టణాభివృద్ధిపై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే మల్ రెడ్డి సమీక్ష...**



**స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్మెట్:**
ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని... క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. తొర్రూర్ లోని క్యాంపు కార్యాలయంలో ఆదిభట్ల సర్కిల్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, ఆక్రమణలు, సంక్షేమ పథకాల అమలు తీరు, పనుల పురోగతిపై అధికారులతో ఆయన ఆరా తీశారు. పట్టణాభివృద్ధిపై ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి దిశానిర్దేశం చేశారు. కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణను ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో మరింత సమర్థవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్న ఆయన... వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీలు, నాలాల పూడికతీతను వేగవంతం చేయాలని చెప్పారు. దెబ్బతిన్న రోడ్లు, గుంతల మరమ్మతులను తక్షణమే పూర్తి చేసి, వీధి దీపాలు పనిచేయని ప్రాంతాల్లో వెంటనే ఏర్పాటు, మరమ్మతులు చేయాలన్నారు. ప్రభుత్వ భూమి కబ్జాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆదిభట్ల, తుర్కయంజాల్ జోనల్ డీసీ సత్యనారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం కమిషనర్ సుదర్శన్ , టీపీవోలు, టీపీఎస్ లు, పారిశుధ్య విభాగం ఇన్ స్పెక్టర్ వనజ, వార్డు ఆఫీసర్లు, ఏఈలు, డీఈలు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


## కుంట్లూరులో మానసిక స్థితి సరిగా లేని మహిళ అదృశ్యం

**హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు**



**స్టార్ త్రినేత్రం, హయత్‌నగర్:**
హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్లూరు వసంత నగర్ కాలనీలో 60 ఏళ్ల మహిళ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే...కుంట్లూరు వసంత నగర్ కాలనీకి చెందిన బొయ్యవరపు వైష్ణవ్ ఈ నెల 13న ఉదయం 11:00 గంటల సమయంలో తన పని నిమిత్తం బయటకు వెళ్లారు. అదే సమయంలో ఆయన తండ్రి పురుషోత్తమసూరి కూడా డ్యూటీ నిమిత్తం బయటకు వెళ్లడంతో, మానసిక స్థితి సరిగా లేని తల్లి బొయ్యవరపు మైత్రి (60) ఇంట్లోనే ఒంటరిగా ఉన్నారు. రాత్రి 11:00 గంటల ప్రాంతంలో వైష్ణవ్ ఇంటికి తిరిగి వచ్చి చూడగా తల్లి కనిపించలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కాలనీ పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద ఎంత వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడు వైష్ణవ్ హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సదరు వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వారు వెంటనే హయత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# మెగాస్టార్ వర్సెస్ సూపర్ స్టార్.. డబుల్ క్లాష్ తప్పదా..?



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి, కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ బాక్సాఫీస్ వద్ద ఎదురెదురుగా తలపడటం ఎప్పుడూ అత్యంత ఆసక్తికరమైన విషయమే. గతంలో 'భోళా శంకర్', 'జైలర్' చిత్రాలతో క్లాష్ అయిన ఈ ఇద్దరు లెజెండ్స్.. ఇప్పుడు మళ్లీ రాబోయే దసరా, సంక్రాంతి రేసుల్లో పోటీ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఇప్పటికే అక్టోబర్ 15న 'జైలర్ 2' విడుదల కానున్నట్లు అధికారికంగా ప్రకటించగా, మరోవైపు వాయిదాలు పడుతూ వస్తున్న చిరంజీవి 'విశ్వంభర'ను అక్టోబర్ 16న దసరా కానుకగా తీసుకొచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. మెగాస్టార్ పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22న దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఈ దసరా క్లాష్ మాత్రమే కాకుండా, 2027 సంక్రాంతి బరిలోనూ వీరిద్దరూ పోటీ పడే సూచనలు కనిపిస్తున్నాయి.కమల్ హాసన్ నిర్మాణంలో రజనీ నటిస్తున్న 'ధర్మన్' చిత్రాన్ని పొంగల్ కానుకగా తేవాలని చూస్తుండగా, బాబీ కొల్లి దర్శకత్వంలో చిరంజీవి చేయనున్న 'మెగా158' ప్రాజెక్ట్‌ను కూడా సంక్రాంతికే సిద్ధం చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అయితే, బడా సినిమాల విడుదల తేదీలు చివరి నిమిషంలో మారడం సహజమే కాబట్టి, ఈ అరుదైన బాక్సాఫీస్ సమరాల్లో ఏవి చివరి వరకు రేసులో నిలుస్తాయో కాలమే సమాధానం చెప్పాలి.

# 'ది ప్యారడైజ్' ఆ సీనియర్ యాక్టర్‌కు కలిసి వస్తుందా..?

సీనియర్ నటుడు మంచు మోహన్ బాబు గత కొన్నేళ్లుగా చాలా జాగ్రత్తగా సినిమాలు ఎంచుకుంటూ, పలు అవకాశాలను తిరస్కరిస్తూ వచ్చారు. 'బుజ్జిగాడు', 'యమదొంగ', 'మహానటి' వంటి చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే ఇటీవల ఘట్టమనేని వారసుడు జయకృష్ణ అరంగేట్ర చిత్రం 'శ్రీనివాస మంగాపురం'లో ఆయన కీలక పాత్ర పోషించినప్పటికీ, ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశ పరిచింది. అందులో మోహన్ బాబు క్యారెక్టర్ డిజైన్ అరకొరగానే ఉండటంతో ఆ ప్రయత్నం విఫలమైంది.వరుసగా ప్రాజెక్టులను తిరస్కరించి, ఇలాంటి ఫ్లాప్ సినిమాను ఎంచుకోవడంపై ట్రేడ్ వర్గాల్లో చర్చ నడిచింది. ఈ నేపథ్యంలో నాచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'లో మోహన్ బాబు ఒక అత్యంత కీలకమైన, శక్తివంతమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమాలో ఆయన క్యారెక్టర్ కథను మలుపు తిప్పేదిగా ఉంటుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే విడుదలైన మోహన్ బాబు ఫస్ట్ లుక్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రాగా, నటుడిగా ఆయన కెరీర్‌కు ఈ చిత్రం చాలా కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్‌లో ఘనంగా 'నశా ముక్త్ భారత్' కార్యక్రమం

## 550 మంది విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ

## బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రం అందజేత

**స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్మెట్:**





మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యవంతమైన మరియు సాధికారత కలిగిన సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలనే ఉద్దేశ్యంతో కోహెడలోని గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్ (సిబిఎస్ఇ క్యాంపస్)లో శుక్రవారం 'నశా ముక్త్ భారత్ అభియాన్' (మాదకద్రవ్యాల రహిత భారత దేశం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ మరియు బ్రహ్మ కుమారీస్ (మెడికల్ వింగ్) సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన '10 కోట్ల నశా ముక్తి ప్రతిజ్ఞ మహా అభియాన్ 2026'లో భాగంగా పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద అంబర్‌పేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు బి. శంకర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆయన ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మత్తు వ్యసనాలకు బానిసలం కాబోమని, డ్రగ్ ఫ్రీ ఇండియాగా దేశాన్ని మార్చేందుకు కృషి చేస్తామని సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు.


### బ్రహ్మకుమారీస్ వారి ప్రశంసా పత్రం

ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన మొత్తం 550 మంది విద్యార్థినీ, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలన పట్ల పాఠశాల యాజమాన్యం మరియు విద్యార్థులు చూపిన అంకితభావానికి గుర్తింపుగా మలక్‌పేట్ బ్రహ్మకుమారీస్ సెంటర్ (మెడికల్ వింగ్) వారు గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్‌కు ప్రత్యేకంగా 'ప్రశంసా పత్రం'హొహొఅందజేశారు. ఈ అవగాహన మరియు ప్రతిజ్ఞా కార్యక్రమంలో గ్రేస్ పాఠశాల డైరెక్టర్హొహొఅల్లం రత్న రెడ్డి, ప్రిన్సిపాల్ కె. మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు తోటపల్లి ఆశీర్వాదం, సాంఘిక శాస్త్ర విభాగం పరిపాలనా అధికారి (ఏఓ) కె. జైపాల్, మేనేజర్ ఎం. చంద్రశేఖర్, రెసిడెన్షియల్ కో-ఆర్డినేటర్ డి. కిరణ్ బాబు, మరియు ఇతర ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

# కోహెడ గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్‌లో ఘనంగా చిత్రలేఖన పోటీలు

**స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్మెట్:**







స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కోహెడలోని గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్ లో శుక్రవారం చిత్రలేఖన పోటీని ఉత్సాహంగా నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ఒక రోజు ముందు నిర్వహించిన ఈ పోటీలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ చిత్రలేఖన ప్రతిభను ప్రదర్శించారు. దేశభక్తి, జాతీయతా భావం, స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ జెండా, భారతదేశ గొప్పతనం వంటి అంశాలను ప్రతిబింబించేలా విద్యార్థులు వివిధ చిత్రాలను ఎంతో ఆసక్తిగా వేశారు. చిన్నారులు సైతం ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు తమ సృజనాత్మకతకు పదును పెడుతూ రంగురంగుల చిత్రాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ అల్లం రత్న రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత, దేశభక్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం కేవలం జాతీయ పండుగగా జరుపుకోవడమే కాకుండా, స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను విద్యార్థులు గుర్తుచేసుకోవాల్సిన సందర్భమని పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచే పిల్లల్లో దేశం పట్ల గౌరవం, బాధ్యత, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. చిత్రలేఖన పోటీ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీయడంతో పాటు, తమ భావాలను చిత్రాల రూపంలో వ్యక్తీకరించే అవకాశం లభించిందని డైరెక్టర్ అల్లం రత్న రెడ్డి తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో కూడా విద్యా, సాంస్కృతిక, క్రీడా రంగాలకు సంబంధించిన వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులందరూ చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె. మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో జాతీయ భావాలను పెంపొందించేలా చిత్రలేఖన పోటీ నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు తోటపల్లి అశీర్వాదం, సాంఘిక శాస్త్ర విభాగం పరిపాలనా అధికారి (ఏఓ) కె. జైపాల్, మేనేజర్ ఎం. చంద్రశేఖర్, రెసిడెన్షియల్ కో-ఆర్డినేటర్ డి. కిరణ్ బాబుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు వేసిన చిత్రాలను ఉపాధ్యాయులు పరిశీలించి వారి ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో దేశభక్తి, సృజనాత్మకత, కళాత్మక నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలను పాఠశాల యాజమాన్యం నిర్వహించడం పట్ల తల్లిదండ్రులు కూడా హర్షం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు నిర్వహించిన ఈ చిత్రలేఖన పోటీ పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొల్పింది.

# స్టార్ డైరెక్టరా.. యంగ్ టాలెంటా?



'లెనిన్' సినిమాతో బాక్సాఫీస్ దగ్గర మంచి రిజల్ట్ దొరకడంతో అక్కినేని అఖిల్ నెక్స్ట్ ప్రాజెక్ట్ మీద అందరి ఫోకస్ పడింది.'లెనిన్' సినిమాతో బాక్సాఫీస్ దగ్గర మంచి రిజల్ట్ దొరకడంతో అక్కినేని అఖిల్ నెక్స్ట్ ప్రాజెక్ట్ మీద అందరి ఫోకస్ పడింది. ప్రస్తుతం కొన్ని కథలు వింటున్న ఈ హీరో నెక్స్ట్ ఎలాంటి అడుగు వేస్తాడనేది ఫిల్మ్ సర్కిల్స్ లో ఆసక్తిగా మారింది. మళ్లీ పేరున్న సీనియర్ దర్శకుడికి ఛాన్స్ ఇస్తాడా, లేక లెనిన్ రిజల్ట్ తో వచ్చిన నమ్మకంతో కొత్త తరం దర్శకుడితోనే ముందుకు వెళ్తాడా అనేది ఇప్పుడు మెయిన్ పాయింట్. 4 అఖిల్ కెరీర్ గ్రాఫ్ ఒకసారి గమనిస్తే ఎక్కువగా దర్శకుల విషయంలో పెద్ద పేర్లనే నమ్ముకుంటూ వచ్చాడు. మొదటి సినిమాను ఏకంగా వీవీ వినాయక్ చేతిలో పెట్టగా, రెండో సినిమా 'హలో' కోసం విక్రమ్ కె కుమార్‌తో పనిచేశాడు. అప్పటికే ఈ ఇద్దరు దర్శకులకు ఇండస్ట్రీలో మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. ఆ తర్వాత మూడో ప్రాజెక్ట్ 'మిస్టర్ మజ్ను' టైమ్ కి మాత్రం అప్పుడే తొలిప్రేమతో హిట్ కొట్టిన వెంకీ అట్లూరికి అవకాశం ఇచ్చాడు. అక్కడి నుంచి మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ కోసం బొమ్మరిల్లు భాస్కర్‌ను ఎంచుకున్నాడు. ఆ సినిమా రిజల్ట్ బాక్సాఫీస్ దగ్గర బాగానే వర్కౌట్ అయింది. కానీ ఆ వెంటనే మళ్లీ స్టార్ డైరెక్టర్ అంటూ సురేందర్ రెడ్డితో ఏజెంట్ ప్రాజెక్ట్ సెట్ చేసుకున్నాడు. లుక్ పరంగా, యాక్షన్ పరంగా ఎన్నో ప్రయోగాలు చేసినా ఆ సినిమా పెద్ద డిజాస్టర్ గా మిగిలిపోయింది. కెరీర్ లో అత్యధిక అంచనాలతో వచ్చిన ఆ ప్రాజెక్ట్ భారీ నిరాశను మిగిల్చింది. ఏజెంట్ ఇచ్చిన ఆ చేదు అనుభవం తర్వాత లెనిన్ కోసం ఎంచుకున్న దారి పూర్తిగా డిఫరెంట్ గా ఉంది. అప్పటికి కేవలం వినరో భాగ్యము విష్ణు కథ మూవీ మాత్రమే చేసిన మురళీ కిషోర్ అబ్బూరు చెప్పిన కథను నమ్మాడు. దర్శకుడి ఇమేజ్ కంటే స్క్రిప్ట్ కే ఫస్ట్ ఓటు వేశాడు. రాయలసీమ బ్యాక్ డ్రాప్ లో వచ్చిన లెనిన్ ఆడియన్స్ కు బాగా కనెక్ట్ అవ్వడంతో ఈ డెసిషన్ అఖిల్ కు బాగా కలిసి వచ్చింది. సరిగ్గా ఇక్కడే అక్కినేని ఫ్యాన్స్ లో కొత్త క్వశ్చన్ రైజ్ అవుతోంది. చేతిలో ఒక హిట్ ఉంది కాబట్టి ఆ ఇమేజ్ ను డబుల్ చేయడానికి ఎవరైనా ఎక్స్ పీరియన్స్ ఉన్న డైరెక్టర్ ను సెట్ చేసుకుంటాడా అనేది ఒక పాయింట్. లేదు కంటెంట్ కే కట్టుబడి మళ్లీ ఎవరైనా యంగ్ డైరెక్టర్ కు గ్రీన్ సిగ్నల్ ఇస్తాడా అనేది ఇంకో పాయింట్. ట్రాక్ రికార్డ్ చూస్తే ఒకే ప్యాటర్న్ ఎప్పుడూ ఫాలో అవ్వలేదు కాబట్టి ఫలానా రూట్ లోనే వెళ్తాడని కచ్చితంగా చెప్పలేం. అయితే ఏజెంట్ ఫెయిల్యూర్, లెనిన్ సక్సెస్ లను పక్కపక్కన పెట్టి చూస్తే ఒక లాజిక్ క్లియర్ గా అర్థమవుతుంది. ఇక్కడ దర్శకుడి పేరు ఎంత పెద్దది అనే దానికంటే, యాక్టర్ కు ఎంతవరకు సెట్ అయ్యే కథ దొరికింది అనేదే అసలైన మేటర్. ప్రస్తుతం వింటున్న కథల్లో అఖిల్ దేనికి ఓటు వేస్తాడు, ఆ ప్రాజెక్ట్ ను హ్యాండిల్ చేసేది కొత్త టాలెంటా లేక సీనియర్ డైరెక్టరా అనేది త్వరలోనే తేలిపోతుంది.

# అప్డేట్లు లేకపోవడం వెనుక అసలు ట్విస్ట్ ఇదేనా?



నాగచైతన్య- కార్తిక్ దండు కాంబినేషన్‌లో రూపొందుతున్న మిస్టిక్ హారర్ థ్రిల్లర్ కూడా అదే రకమైన స్ట్రాటజీని ఫాలో అవుతూ డిస్కషన్ కు కారణమైంది సినిమా ప్రచారం అంటే ఒకప్పుడు ఫస్ట్ లుక్, టీజర్, సాంగ్స్, ట్రైలర్, ఇంటర్వ్యూలు, ఈవెంట్లతో రెగ్యులర్ హడావుడి కనిపించేది. కానీ ఇటీవల కొన్ని పెద్ద ప్రాజెక్టులు పూర్తిగా భిన్నమైన వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. మొదలైనప్పుడు ఒక చిన్న టీజర్ లేదా కాన్సెప్ట్ గ్లింప్స్ రిలీజ్ చేసి, ఆ తర్వాత చాలా కాలం ఎలాంటి అప్డేట్లు ఇవ్వకుండా ఉండటం ఇప్పుడు కొత్త మార్కెటింగ్ ట్రెండ్‌గా మారుతోంది. నాగచైతన్య- కార్తిక్ దండు కాంబినేషన్‌లో రూపొందుతున్న మిస్టిక్ హారర్ థ్రిల్లర్ కూడా అదే రకమైన స్ట్రాటజీని ఫాలో అవుతూ డిస్కషన్ కు కారణమైంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మొదటి విజువల్ మెటీరియల్ రిలీజైన తర్వాత ఫ్యాన్స్ వరుస అప్డేట్లను ఆశించారు. అయితే నెలలు గడిచినా సినిమా నుంచి పెద్దగా ప్రమోషన్స్ కనిపించలేదు. దీంతో ప్రాజెక్ట్ పురోగతిపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, సినిమా పోస్ట్ ప్రొడక్షన్‌కు, ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎక్కువ టైమ్ కేటాయిస్తున్నట్లు డిస్కషన్ నడుస్తోంది. మిస్టిక్ హారర్ జానర్‌లో వాతావరణం, విజువల్ డిజైన్, సౌండ్ ఎలిమెంట్స్ కీలకం కావడంతో మేకర్స్ తొందరపడకుండా పనులు పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది అప్డేట్లు ఆలస్యం కావడం ప్రతి సారి నెగెటివ్ సిగ్నల్ కాకపోవచ్చు. కొన్ని సందర్భాల్లో అదే క్యూరియాసిటీని పెంచే సాధనంగా మారుతుంది. ఆడియన్స్ కు ప్రతి వారం కొత్త పోస్టర్ లేదా వీడియో ఇవ్వకుండా, సినిమా గురించి మాట్లాడుకునే స్పేస్‌ను సోషల్ మీడియాకే వదిలేయడం కూడా ఒక మార్కెటింగ్ పద్ధతిగా మారుతోంది. ముఖ్యంగా మిస్టరీ, హారర్, థ్రిల్లర్ జానర్లలో ఎక్కువ సమాచారం బయటకు రాకపోవడం ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతుంది. నాగచైతన్య కెరీర్ పరంగా కూడా ఇది ఆసక్తికర దశ అనే చెప్పుకోవాలి. కమర్షియల్, రొమాంటిక్ కథల తర్వాత భిన్నమైన జానర్ల వైపు అడుగులు వేస్తున్న చైతూకి ఈ సినిమా ఇమేజ్ పరంగా కీలకంగా మారే అవకాశం ఉంది. మరోవైపు దూత సెకండ్ సీజన్ వర్క్స్ కూడా వేగంగా సాగుతున్నాయి. అంటే థియేట్రికల్ మార్కెట్‌తో పాటు ఓటీటీ ఆడియన్స్ న కూడా చైతూ సమాంతరంగా టార్గెట్ చేస్తున్నట్టు అర్థమవుతుంది. డిసెంబర్ రిలీజ్ టార్గెట్ గా పనులు కొనసాగుతున్నాయనే ప్రచారం మధ్య, అఫీషియల్ అనౌన్స్‌మెంట్స్ కంటే ఈ సైలెన్స్‌నే ఇప్పుడు సినిమా బలంగా మార్చే ప్రయత్నం జరుగుతోందా అనే చర్చ పరిశ్రమలో వినిపిస్తోంది. రిలీజ్ డేట్ ను ఒకేసారి అనౌన్స్ చేస్తే ఆ గ్యాప్ వల్ల ఏర్పడిన క్యూరియాసిటీ సినిమాకు అదనపు బజ్ తీసుకురావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం చూస్తుంటే, ఓవర్ ప్రమోషన్ కంటే కంట్రోల్డ్ సైలెన్స్ కూడా ఒక మార్కెటింగ్ టూల్‌గా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com